www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 15 అక్టోబర్ 2024

5

తూర్పుగోదావరి

సిఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కు అందజేత

కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న సర్పంచ్ పట్టియ్య

కడియం : కడియం మండలం దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1.08 లక్షల చెక్కును కలెక్టర్ పి.ప్రశాంతికి సోమవారం అందజేశారు. ఇటీవల రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు భారీ నష్టం వాటిల్లిందని, తన వంతు సాయంగా ఈ సాయం అందించామన్నారు. సర్పంచ్‌గా పొందుతున్న 36 నెలలు గౌరవ వేతనాన్ని కలెక్టర్‌కు అందించానని తెలిపారు. ఆయన వెంట వీవర్స్ నాయకులు నూలు బాలకోటయ్య, బూడిద బ్రహ్మం, గుత్తి సత్యనారాయణ, కాలెపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక ఫుల్ కిక్కు

- కోలాహలంగా లక్కీడీప్
- చక్రం తిప్పిన సిండికేట్
- ప్రయివేటు వ్యక్తులకు మద్యం షాపుల కేటాయింపు పూర్తి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మద్యం పాలసీ తుది అంకం ముగిసింది. ఇక షాపుల ఏర్పాటే తరువాయి. 16వ తేదీ నుంచి ప్రయివేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో సోమవారం నిర్వహించిన లాటరీ ప్రక్రియ కోలాహలంగా సాగింది. ఉదయం 7 గంటల నుంచే పెద్ద సంఖ్యలో దరఖాస్తు దారులు కళాకేంద్రం వద్దకు చేరుకున్నారు. జిల్లా పరిధిలో 125 షాపులు 4,384 మంది అభ్యర్థులు దరఖాస్తు చేరుకున్నారు. అత్యధిక మంది దరఖాస్తులు చేసుకున్న జిల్లాలో తూర్పు గోదావరి రాష్ట్రంలోని మూడో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ అనుసరించి తొలుత రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని షాపులకు లాటరీ ప్రక్రియ ప్రారంభించారు. తదుపరి మండలాలు , మున్సిపాలిటీ వారీగా అక్షర క్రమంలో మండలాల వారీగా లాటరీ పద్ధతిలో షాపులు కేటాయింపు చేశారు.

లాటరీ ద్వారా షాపులను కేటాయిస్తున్న జెసి చిన్నరాముడు

లాటరీ పద్ధతిలో మొదటి వ్యక్తి కేటాయింపు జరపడంతో పాటుగా నిర్ణీతకాలవ్యవధిలో ఫీజు చెల్లించని యెడల తదుపరి మరో ఇద్దరు పేర్లను కూడా లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన రిజర్వ్ చేశారు. ఈ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసులు అధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. దరఖాస్తు చేసుకున్న వ్యక్తులను మాత్రమే లోపలికి అనుమతించారు.జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు షాపులు వారీగా బిడ్స్ వేసిన వారికి ఒక నెంబర్ కేటాయించి, టోకెన్ జారీ చేశారు. టోకెన్ ఉన్న వారిని మాత్రమే హాల్ లోకి అనుమతించారు. తదుపరి వారి సమక్షంలో టోకెన్ నెంబర్లను డ్రాప్ బాక్స్‌లో వేసి డ్రా నిర్వహించారు. దరఖాస్తుల ప్రక్రియలో జిల్లా లక్ష్యం 3,750 కాగా 632 దరఖాస్తులు అధికంగా వచ్చాయి.

అధికార పార్టీ నేతల బెదిరింపులు, సిండికేట్లు, పంచాయతీలు, వ్యాపారుల తర్జనభర్జనల మధ్య జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు రచించిన వ్యూహాలు ఫలించాయి. కొన్ని నియోజక వర్గాల్లో సిండికేటై దరఖాస్తులు చేసుకున్నారు. ఎవరికి షాపు వచ్చినా సమన్వయంతో నిర్వహించుకునేలా ఒప్పందాలు చేసుకున్నట్టు సమాచారం. మద్యం షాపులు దక్కించుకోవడానికి అధికార పార్టీ నేతలు తమ బినామీల ద్వారా ఎత్తులకు పై ఎత్తులు వేశారు. లాటరీ పద్ధతిలో కొందరికి అదృష్టం వరించకపోవటంతో నిరాశే మిగిలింది. లైసెన్సు ఫీజు ఆరు విడతలుగా చెల్లించుకునే వెసులు బాటు ఉండటంతో వ్యాపారులు కొన్ని దుకాణాలకు తీవ్రంగా పోటీ పడ్డారు. జిల్లాలో 54వ దుకాణానికి అత్యధికంగా 67 మంది దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా 34వ దుకాణానికి 12 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని 7 నియోజక వర్గాలలో గోపాలపురం నియోజకవర్గంలో అత్యధికంగా దరఖాస్తుదారులు పోటీపడ్డారు. 14 షాపులకు 765 మంది పోటీ పడ్డారు. అక్కడ ఒకొక్క షాపునకు సగటున 54 దరఖాస్తులు అందాయి. అనపర్తి నియోజకవర్గంలో అల్పంగా దరఖాస్తులు వచ్చాయి. ఒకొక్క షాపునలకు సగటున 18 దరఖాస్తులు లభించాయి. దరఖాస్తు దారుల సంఖ్య ఘననీయంగా ఉండటంతో ఆనం రోటరీ హాలు కిక్కిరిసి పోయింది. దీంతో వెలుపల టెంట్లు ఏర్పాటు చేసిన ఎల్ఇడి స్క్రీన్‌ను ఏర్పాటుచేశారు. దరఖాస్తు దారులకు కార్లు సబ్ కలెక్టరు కార్యాలయం, గోకవరం బస్టాండ్ తదితర పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వరి కోతలు వాయిదా వేయాలి

రైతులకు కలెక్టర్ ప్రశాంతి సూచన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో వరికోతలను వాయిదా వేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి రైతులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌డిఒ, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు ఇతర క్షేత్ర స్థాయి అధికారులతో అధిక వర్షాలు, పల్లె పండుగ, రెవెన్యూ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. కలెక్టర్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ సమావేసానికి మండల స్థాయి అధికారులు అందరూ ఒకచోటే ఉండి హాజరుకావాలన్నారు.

రెవెన్యూ డివిజనల్ అధికారురు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ జరిగిన వరి కోతల్లో 2,555 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందన్నారు. ఆ ధాన్యం ఓపెన్ మార్కెట్‌కు వెళ్లిందా? లేదా అన్నది? నిర్ధారణ చేసుకోవాలన్నారు. వాటి వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. పిఆర్ 126 లేదా ఇతర ఫైన్ వెరైటీ ధాన్యం అమ్మకాలపై దృష్టి పెట్టాలన్నారు. గన్నీ బ్యాగుల కేటాయింపులు, వాహనాల ఏర్పాటు, హమాలీలు, ఆర్ఎస్‌కెలలో మౌలిక వసతులపై దృష్టి పెట్టాలన్నారు.

పల్లె పండుగ కార్యక్రమంలో మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలని కలక్టర్ ఆదేశించారు. కొత్తగా చేరిన ఎంపిడిఒలు తక్షణం కలెక్టర్‌కు రిపోర్టు చేయాలన్నారు. అనంతరమే విధులను నిర్వహించాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన పనుల వివరాలు ప్రజలకు తెలిసే విధంగా ప్రదర్శించాలని, వాల్ పెయింట్స్ చేయించాలన్నారు. ఉపాధి కూలీలు ఆయా ప్రాంతాల్లో జరిగే పల్లెపండుగలో పాల్గొనేలా చూడాలన్నారు. గ్రామ స్థాయి సచివాలయ సిబ్బంది తప్పని సరిగా హజరు కావాలన్నారు. గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు.

లోతట్టు, ముంపు ప్రాంతాలు, శ్మశానాల అభివృద్ధిపై ప్రతి మండలం నుంచి ప్రతిపాదనలు పంపాలన్నారు. అక్టోబరు 16 నుంచి ఇసుక రీచ్‌లు ప్రారంభం కానున్న దృష్ట్యా సిసి కెమెరాలనె వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రీచ్ పాయింట్‌కు 4 నుంచి 6 ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు కోసం పోల్స్ సిద్ధం చేయాలన్నారు. అనంతరం రీచ్‌ల వద్ద తవ్వకాలు ప్రారంభించాలన్నారు. దీనిపై ఆర్‌డిఒలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ జి.నరసింహులు, సిపిఒ ఎల్.అప్పలకొండ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డిపిఒ బి.శ్రీనివాస రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎమ్‌డి.అలీముల్లా, జిల్లా హార్టీకల్చర్ అధికారి బి.సుజాతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడు శ్రీనును కఠినంగా శిక్షించాలి

బాధితురాలు యాంకర్ కావ్యశ్రీ డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అనుచరుడు, వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎన్‌వి.శ్రీనుని కఠినంగా శిక్షించాలని యాంకర్ కావ్యశ్రీ డిమాండ్ చేశారు. అప్పుగా ఇచ్చిన సొమ్మును తిరిగి అడిగినందుకు ఎన్‌వి.శ్రీను తనపైనా, తన తండ్రి నాగరాజుపైనా దాడి చేశాడని బాధితురాలు తెలిపింది. ప్రెస్ క్లబ్‌లో తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ తదితరులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్‌వి.శ్రీనివాస్ తనయుడు అభిలాష్‌కు మూడేళ్ల క్రితం రూ.3లక్షలు నగదు అప్పుగా ఇచ్చానని తెలిపారు. అవి తిరిగి ఇవ్వాలని 30 సార్లకు పైగా వారి చుట్టూ తిరిగామన్నారు. నగదు ఇవ్వాలని గట్టిగా అడిగానని తనపైన తన తండ్రి నాగరాజుపై దాడి చేశారని వాపోయారు. ఇదే విషయమై మాజీ ఎంపీ భరత్‌తో కూడా పలుమార్లు మాట్లాడానని తెలిపారు. అయినా స్పందించలేదన్నారు. దాడిపై ప్రకాశం నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తిరిగి తమపైనే కేసు పెట్టాలంటూ ఒత్తిడి తెచ్చారన్నారు. మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ మాట్లాడుతూ ఎన్‌వి.శ్రీను అహం తగ్గేలా పోలీసులు శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. బాధితురాలికి తెలుగు మహిళలమంతా మద్దతుగా ఉంటామని తెలిపారు. ఈ విషయమై హోం మంత్రి అతనితను కలుస్తామన్నారు. ఈ సమావేశంలో తెలుగు మహిళలు బోను ఈశ్వరి, శ్రీలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యాంకర్ కావ్యశ్రీ

తాగు నీరు వృథా

ప్రజాశక్తి- కడియం

గోదావరి తాగు నీరు వృథాగా నేల పాలవుతోంది. కడియం మండలం వేమగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రత్నా ప్లాస్టిక్స్ ఫ్యాక్టరీ సమీపంలో గోదావరి పైప్ లైన్ లీకేజీ కారణంగా కొన్ని రోజులుగా తాగు నీరు వృథాగా పోతోంది. గోదావరి నీరు బొమ్మూరు వద్ద శుద్ధి చేసి తాగునీరుగా మార్చి కడియం మండలానికి ఈ పైపులైను ద్వారా అందిస్తారు. ఈ పైప్ లైన్ వాల్వ్ నుంచి నీరు వృథాగా పోతోంది. రోజుల తరబడి తాగునీరు వృథాగా పోతోందని స్థానిక పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు చెబుతున్నారు.

నవరాత్రుల ముగింపు

దేవరపల్లి : పల్లంట్లలో దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో దేవీనవరాత్రులు ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, ఈడుగంటి శివరాం ప్రసాద్ విజయలక్ష్మి దంపతులు, గన్నమని సత్య ప్రసాద్ రమాదేవి దంపతులు, కొయ్యలమూడి సురేంద్రనాథ్ చటర్జీ, మొక్కపాటి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, మొగలపు లక్ష్మణరావు, గన్న మని సత్యనారాయణ, ఆలయ అర్చకులు వై.సుజనశర్మ, రామకృష్ణశర్మ పాల్గొన్నారు.

ఘనంగా పల్లె పండుగ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గోకవరం మండలంలో జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో రూ.4.55 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశామన్నారు. కామరాజుపేటలో రూ.70 లక్షలతో ఆరు సిసి రోడ్లు, కొత్తపల్లిలో రూ.50 లక్షలతో ఐదు సిసి రోడ్లు, డ్రెయిన్లు, కృష్ణునిపాలెంలో రూ.60 లక్షలతో డ్రెయిన్లు, గోకవరంలో రూ.2.50 కోట్లతో 9 సిసి రోడ్లు, మల్లవరంలో రూ.25లక్షలతో రెండు సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

నరేంద్రపురంలో శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణ

తాళ్లపూడి : గజ్జరంలో రూ.10లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమస్యలను గుర్తించి విడతలవారీగా వాటిని పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల వద్ద ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి సూచించారు. శ్మశానం, పాఠశాలల్లో స్థలాలు చదును పనులకు ప్రతిపాదనలు పంపాలని ఇంజినీరింగ్ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణ, ఇఒపిఆర్‌డి వీరన్న, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

రాజానగరం : కలవచర్ల, సీతారామపురం, వెలుగుబొంద, పల్లకడియం, ఫరిజిల్లిపేట, కానవరం తదితర గ్రామంలో ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ పర్యటించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన వెంట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఉన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

పెరవలిలో 17న శంకుస్థాపనలు

పెరవలి : పల్లె పండుగలో భాగంగా రూ.1.49 కోట్లతో 15 పనులకు ఈ నెల 17, 18వ తేదీల్లో మంత్రి దుర్గేష్ శంకుస్థాపన చేయనున్నట్టు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ తెలిపారు. 17న అజ్జరం, కాకరపర్రు, 18న పెరవలి, కొత్తపల్లి అగ్రహారం, ఖండవల్లి, ముక్కామల, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టల వేమవరం గ్రామంలో శంకుస్థాపనలు జరుగుతాయన్నారు.

‘పార్డ్ ఇండియా’ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - నల్లజర్ల

గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక పరిపుష్టికి ఆలంబనగా, మహిళా సాధికారిత సాధించే దిశగా పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సోమవారం నల్లజర్లలో పవర్ ఆఫ్ సూవింగ్ పేరిట పార్డ్ ఇండియా మహిళల కోసం ప్రత్యేకించి చేపట్టిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుట్టు శిక్షణ ద్వారా మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలన్నారు. సేవే ప్రధాన ధ్యేయంగా పనిచేసే స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రభుత్వ పరంగా తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమ ప్రధాన నిర్వాహకులు, పార్డ్ ఇండియా జాతీయ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహిస్తున్నామన్నారు. త్వరలోనే అత్యవసర అంబులెన్సు సర్వీసు, శీతల శవపేటిక, కైలాస రథాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని ప్రకటించారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

పార్డ్ ఇండియా నల్లజర్ల మండల శాఖ నూతన కార్యవర్గంతో ఎంఎల్ఎ మద్దిపాటి ప్రమాణస్వీకారం చేయించారు. మండల గౌరవ అధ్యక్షులుగా చీమకుర్తి కృష్ణప్రసాద్, అధ్యక్షులుగా మహ్మద్ ఇలియాస్‌షరీఫ్, ప్రధాన కార్యదర్శిగా కూరపాటి నాగరాజు, కోశాధికారిగా జివివి.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, వీరమల్ల అనిల్‌కుమార్, ఎస్‌కెఎస్.సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ అందుకుల వెంకటేశ్వరరావు, గురజాల దుర్గారావు, మహిళా శక్తి విభాగం గోతం సత్యలక్ష్మి, గుదే శిరీష సంకు వెంకటలక్ష్మి తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, సిఐ శ్రీనివాసరావు, ఎంపిడిఒ సింహాద్రిరావు, కూచిపూడి ఉదయ భాస్కరరావు, బి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఎపి ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం సమావేశం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండల ఎపి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం చాగల్లు అంబేద్కర్ రీడింగ్ భవనంలో సంఘం అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో నూతన సభ్యులను సంఘంలోకి చేర్చుకోవాలని, సొంత భవనం ఎర్పాటుకు స్థలం సేకరణకు కృషి చేయాలని తీర్మానించారు. సంఘంలోకి నూతనంగా చేరిన విశ్రాంత ఉపాధ్యాయులు జగతా సత్యనారాయణ, నాగలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. సాల్మన్‌రాజు, గంగాధర్, డి.నాగేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

నల్లజర్ల : ప్రజాస్వామ్యంలో బుల్లెట్ కంటే బ్యాలెట్ చాలా శక్తివంతమైందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎంఎల్‌సి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్‌డిఎ ఎంఎల్‌సి ఎన్నికల ఇన్‌ఛార్జి చిరంజీవిరావు అన్నారు. సోమవారం నల్లజర్లలోని ఎంఎల్ఎ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 6లోగా పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. 2021వ సంవత్సరం అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తయిన వారు ఓటు హక్కుకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో యలమాటి శ్రీనివాసరావు కూచిపూడి ఉదయ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

రాజమహేంద్రవరం : ప్రజలకు ఎన్నికలు సమయంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఇఫ్టూ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. నిత్యావసరాల ధరలు నింగికెగసి సామాన్యులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు, తుపానులు, వరదలతో పనులను కోల్పోయి కార్మికులు పూట గడవక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉల్లి, టమాటో, వెల్లుల్లి వంటి నిత్యావసరాల ధరలు సామాన్యుడు కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. ఈ సమయంలో ధరలను నియంత్రించడంలోనూ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు.

వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం

తాళ్లపూడి : విద్య, వైద్యం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకునేందుకు మానవతా సేవా సంస్థ అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉంటుందని ఆ సంస్థ మండల అధ్యక్షులు అంకెం సురేష్ అన్నారు. ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో ఆపరేషన్ చేయించుకుని మంచానికే పరిమితమై ఇబ్బందులు పడుతున్న వేగేశ్వరపురం గ్రామానికి చెందిన కాపెల్లి శ్రీనివాస్‌కు మానవత సంస్థ రూ.6వేల సాయం అందించింది. ఈ కార్యక్రమంలో మానవతా సభ్యులు సనపల రాజశేఖర్, అప్పన హనుమంతు, పి.దుర్గాప్రసాద్, టిఎన్‌బి.గుప్త, సిహెచ్.ఆంజనేయులు, కె.నాగరాజు, కె.వెంకటేష్, జి.అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని నిరాహార దీక్ష

ప్రజాశక్తి- గోకవరం

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వీరశూర్ల కార్తికేయకు న్యాయం చేయాలని గోకవరం మండలం దళిత నాయకుడు వరసాల ప్రసాద్ సోమవారం స్థానిక లూథరన్ చర్చ్ చెక్ పోస్ట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వరసాల ప్రసాద్ మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం కార్తికేయ ఎఎంఆర్ మైనింగ్ సీనరేజ్ కాంట్రాక్ట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ విధులు నిర్వహిస్తుండగా బూరుగుపూడి గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. తోటి ఉద్యోగులు అతన్ని ఆసుపత్రిలో చేర్పించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మైనింగ్ కంపెనీ యాజమాన్యం ఎలాంటి వైద్యం చేయించలేదన్నారు. ఆర్థికంగా కూడా ఆదుకోలేదన్నారు. మైనింగ్ కాంట్రాక్ట్ సంస్థ నుంచి ఎటువంటి స్పందన లేదని తెలిపారు. ప్రమాద బాధితుడు కార్తికేయకు వైద్యం చేయించక పోగా మానవత్వంతో ఆసుపత్రికి వెళ్లి పరామర్శించడానికి కూడా వెళ్లలేదని తెలిపారు. కార్తికేయ ఒక దళిత బిడ్డని అతనికి వైద్యం చేయించుకునే స్థోమత లేదన్నారు. అనారోగ్యంతో కొట్టు మిట్టిలాడుతున్నాడని తెలిపారు. కార్తికేయకు న్యాయం జరిగే వరకు ఈ నిరాహార దీక్ష ఆపేది లేదని, న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా దళిత నాయకులతో కలిసి దీక్షను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ దీక్షకు పలువురు నాయకులు, సంఘాలు, సంఘీభావం తెలిపారు.

కార్టూ‘నిజం’



పిజిఆర్ఎస్‌లో 120 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 120 అర్జీలను స్వీకరించామని జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు తెలిపారు. టూరిజం రీజినల్ డైరెక్టర్ బి.స్వామినాయుడుతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన సమస్యల పట్ల క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చి పరిష్కారం చేసే దిశగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సంబంధిత అంశాలపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లకు దిశానిర్ధేశం చేయాలన్నారు. రెవెన్యూకు 47 , వ్యవసాయ శాఖ 22 , పోలీసు శాఖకు 15, పంచాయతీ రాజ్‌కు 9, ఇతర శాఖలకు సంబంధించిన 27 అర్జీలు వచ్చాయని తెలిపారు.

ప్రశాంతంగా కుంతీదేవి జాతర

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సూర్యారావు పాలెంలో సోమవారం కుంతీదేవి జాతర ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన అమ్మవారి వాహనాన్ని వేషధారణలు, మేళ తాళాలు, డీజేలతో గ్రామంలోని వాడవాడలా ఊరేగించారు. సర్పంచ్ మెండే లలిత కుమారి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా శాంతియుతంగా జాతర పూర్తయ్యేందుకు సహకరించిన ఎస్ఐ జి.శ్రీనివాస్, పోలీస్ సిబ్బందికి సర్పంచ కృతజ్ఞతలు తెలిపారు.

కుంతీదేవిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

చంద్రయ్య పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి -దేవరపల్లి

ద్వారబంధాల చంద్రయ్య పుస్తకాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఆవిష్కరించారు. జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణరాజు మంత్రిని సోమవారం రాజమహేంద్రవరంలో కలిశారు. ద్వారబంధాలు చంద్రయ్య జీవితచరిత్రను రాష్ట్ర వ్యాప్తంగా తెలిసే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాలైన జంగారెడ్డిగూడెం గోపాలపురం పోలవరం కుక్కునూరు ఏలూరుపాడు, భద్రాచలం, బురదకోట గోదావరి పరిసర ప్రాంతాలలో ద్వారబంధాల చంద్రయ్య విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ప్రజల కోసం స్వాతంత్ర్య ఉద్యమాన్ని అల్లూరి సీతారామరాజు కంటే 50 ఏళ్లు ముందే చంద్రయ్య ప్రారంభించాన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చంద్రయ్య నిర్వహించిన పాత్రను అందరికీ తెలిసే విధంగా వనాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని కేబినెట్ సమావేశంలో ప్రస్తావిస్తానని తెలిపారు. ఈ విషయాన్ని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశిరెడ్డి బలరాంనాయుడు, ద్వారబంధాల చంద్రయ్య జాతీయ యువజన సంఘం ఉపాధ్యక్షులు మధు అనిశెట్టి, ద్వారకాతిరుమల జనసేన పార్టీ నాయకులు కరగల్ల శ్రీను, చిలుకూరి ఫణి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నేరాలు ఘోరాలు

ఆటోబోల్తా, ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ రోడ్డులోని మాధవ పట్టణం సమీపంలో సోమవారం ఆటో తిరగబడిన సంఘటనలో సామర్లకోటకు చెందిన ముగ్గురు మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. సామర్లకోట విఘ్నేశ్వర థియేటర్ ప్రాంతానికి చెందిన అయిదుగురు మహిళలు సోమవారం మధ్యాహ్నం కాకినాడ ప్రతాప్ నగర్‌లో జరిగే శుభాకార్యానికి ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఆటో మాధవ పట్టణం గ్రామం సమీపానికి వెళ్ళగా రోడ్డుకు పడిన గోతులను తప్పించే ప్రయత్నంలో డ్రైవర్ ఆటోను రోడ్డు పక్కకి నడపగా అది అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సహాయంతో కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

కోడి పందెంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లి గ్రామ శివారున రహస్యంగా కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరు పందెం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.1050 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలలో కాపర్ వైర్ చోరీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో రూ.15 వేలు విలువజేసే కాపర్ వైర్ చోరీకి గురైంది. దసరా సెలవులు నేపథ్యంలో పాఠశాల మూసి వేసి ఉండడంతో పాఠశాల ఆవరణలో పాత భవనం నుంచి కొత్త భవనంలోకి విద్యుత్ సరఫరా నిమిత్తం దాత సహకారంతో అందించిన సుమారు రూ. 15వేలు విలువచేసే విద్యుత్ కాపర్ వైర్‌ను చోరీ చేశారు. పాఠశాలకు అమర్చిన సీసీ కెమెరాను ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు పాఠశాల ఉపాధ్యాయులు హనుమంత్ చెప్పారు. పాఠశాల బడి గంట సైతం చోరీ చేసేం దుకు ప్రయత్నం చేసి దానిని పాఠశాల మైదానంలోనే పడి వేసి వెళ్లిపోయారన్నారు. చోరీ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఉపాధ్యాయులు హనుమంత్ చెప్పారు.

యువకుల మృతదేహాలు స్వాధీనం

ప్రజాశక్తి - రామచంద్రపురం

దేవి విగ్రహ నిమజ్జనం సందర్భంగా కోటిపల్లి గోదావరిలో ఆదివారం రాత్రి గల్లంతైన యువకులు మతి చెందారు. గాలింపు చేపట్టిన పోలీసులు సోమవారం మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రావి చెరువు గ్రామానికి చెందిన మేడిశెట్టి వీర బ్రహ్మ (35) నరాల వేదమూర్తి(30) మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి తరలించారు. కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

ప్రజాశక్తి - ఆలమూరు

ఈ నెల 8న మద్యం సేవించి లారీ నడుపిన దాకారపు రమేష్ బాబును ఎస్ఐ ఎం.అశోక్ తన సిబ్బందితో కలసి పట్టుకొని, కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. దీంతో స్థానిక కోర్టు ఇన్‌ఛార్జి మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్ సోమవారం ముద్దాయికి 15 రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తపేట

మద్యానికి బానిసై ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. మోడేకుర్రు గ్రామ శివారు గొల్లకోటివారి పాలేనికి చెందిన ఈతకోట నాగరాజు(48) కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నాడు. ఆయన మద్యానికి బానిసై ఆదివారం రాత్రి ఇంటి వద్ద వ్యవసాయాలకు వాడే పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే ఆయన భార్య సత్యవతి, కొడుకు అవినాష్ 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగిన యువతి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

తాను పెళ్లి చేసుకుని వెళ్లిపోతే తల్లి ఒంటరిదవుతుందనే బెంగతో పురుగుమందు తాగిన యువతి సోమవారం చికిత్స పొందుతూ మరణించింది. మండలంలోని మెర్లపాలెం గ్రామానికి చెందిన సురేఖ (23) పేరవరంలో పోస్ట్ ఉమెన్‌గా పని చేస్తోంది. ఆమెకు తండ్రి లేడు. తల్లి సురేఖకు వివాహం చేస్తానని చెప్పడంతో తనకు వివాహం చేస్తే తల్లి ఒంటరిగా ఉంటుందని మనస్తాపం చెంది గత నెల 30న పేరవరం పోస్ట్ ఆఫీస్ దగ్గర పురుగు మందు తాగింది. వెంటనే ఆమెను రాజానగరం జిఎస్ఎల్ హాస్పటల్ తరలించారు అప్పటినుండి చికిత్స పొందుతూ సోమవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎఎస్ఐ పెద్దిరాజు తెలిపారు.

నగల చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

నగల చోరి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఉండ్రాజవరం ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పాలంగి గ్రామానికి చెందిన వేండ్ర దుర్గ సాయికిషోర్ ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. దుర్గసాయికిశోర్ భార్యతో పాటూ సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి, ఉద్యోగ నిమిత్తం తణుకు వెళ్లి, సాయంత్రం తిరిగి వచ్చారు. తాళం పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లగా బీరువా తాళం తీసి ఉందని, తనిఖీ చేయగా సుమారు 8 కాసుల బంగారు వస్తువులు చోరీకి గురైనట్టు గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశారు.

పాఠశాలలో విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో లంపకలోవ జడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతీ దేవి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. పాఠశాల హెచ్‌ఎం రాఘవకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం సంఘటన స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం మాట్లాడుతూ సంఘటనా స్థలంలో విగ్రహాన్ని పరిశీలించామని, జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అధికారుల కొట్లాట ఘటనపై విచారణ

ప్రజాశక్తి - పిఠాపురం

కౌన్సిలర్లతో మాట్లాడుతున్న విచారణ కమిటీ సభ్యులు

పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ఆగస్టు 31న జరిగిన కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కనకారావు, డిఇ భవానిశంకర్ బాహాబాహికి దిగిన సంఘటనపై నియమించిన కమిటీ సోమవారం విచారణ చేపట్టింది. వీడియోలను పరిశీలించారు. సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులను, బాహాబహీకి దిగిన మున్సిపాలిటీ కమిషనర్, డిఇ నుంచి వివరణలు తీసుకున్నారు. వివాదానికి కారకులైన ఇద్దరు అధికారులను మార్చేయాలని కౌన్సిలర్లు విచారణ కమిటీకి వినతిపత్రాన్ని అందించారు.

నివాస ప్రాంతాల్లోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇల్లు లేని పేదలకు వారు నివసిస్తున్న గ్రామాల్లోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం రూరల్ శాఖా మహాసభ విజ్ఞప్తి చేసింది. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఎం.సత్తిబాబు అధ్యక్షతన పెద్దాపురం రూరల్ శాఖ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం గ్రామాల్లో నివసించే పేద కుటుంబాల వారికి పది కిలోమీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. దీంతో తమ నివాస పరిసర గ్రామాలలో పనులు చేసుకునే వీరందరికీ ఆ స్థలాలు నిరుపయోగంగా మిగిలిపోయాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీరందరికీ వారి నివసించే గ్రామాలలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పెద్దాపురం రూరల్ కార్యదర్శిగా కేదారి నాగు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సమావేశంలో మాగాపు నాగు, సత్తిబాబు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ మార్గాన్ని అనుసరించాలి

ప్రజాశక్తి - తాళ్ళరేవు రూరల్

పౌరులంతా అంబేద్కర్ మార్గాన్ని అనుసరిస్తే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సమన్యాయం జరుగుతుందని పలువురు అన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవనంలో 68వ బౌద్ధ దమ్మ దీక్ష దినోత్సవ కార్యక్రమం బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మండలాధ్యక్షులు పి. నాగేంద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా త్రిరత్న బౌద్ధ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు పి.సుధీర్ మాట్లాడారు. దేశంలో మనువాద సిద్ధాంతాలు వేళ్లూనుకున్న పరిస్థితుల్లో వ్యవస్థ మారదని భావిస్తే బౌద్ధ ధర్మాన్ని స్వీకరిస్తానని 1935లో అంబేద్కర్ ప్రకటన చేసి, 21 సంవత్సరాల తర్వాత 1956 అక్టోబర్ 14న నాగపూర్‌లో 5 లక్షల మందితో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారన్నారు. ఈ కార్య క్రమంలో జక్కల ప్రసాద్, భైరవమూర్తి, పంతగడ రాంప్రసాద్, నాగేశ్వర్, గిడ్ల వీరప్రసాద్, ప్రజాసంఘాల నాయకులు టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌ని గాలికొదిలేసిన అధికారులు

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు గాలికి వదిలేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పిజిఆర్ఎస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతీ సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందనే సమాచారం కూడా ప్రజలకు చేరువ కావడం లేదు. దీంతో అర్జీదారులు కలెక్టరేట్‌కు వెళ్లేందుకు మొక్కువ చూపుతున్నారు. మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమానికి పలు సందర్భాల్లో ఒక్క అర్జీదారు రాకవడం లేదు. ఇదే అదునుగా చూసుకుని కొందరు అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఏదో తూతు మంత్రంగా రెండు మూడు శాఖల అధికారులు మాత్రం వచ్చి వెళ్ళిపోతున్నారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ నాతి బుజ్జి, ఎంఇఒ కెహెచ్.నాయక్, వ్యవసాయ శాఖ ఎఒ సద్గురుమూర్తి మాత్రమే హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఒక్క అర్జీ మాత్రమే వచ్చిందని తహశీల్దార్ తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరుకావాల్సివున్నా..ముఖ్యమైన అధికారులు వస్తే సరిపోతుందని తహశీల్దార్ వివరణ ఇవ్వడం అధికారుల చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తుంది.

విద్యాభివృద్ధికి దాతల ప్రోత్సాహం అవసరం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

దుస్తులు మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

విద్యాభివద్ధికి దాతల ప్రోత్సాహం ఎంతైనా అవసరమని స్థానిక సర్పంచ్, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ మధురపేట ఎంపిపి పాఠశాలలో సోమవారం ఎస్‌ఎంసి చైర్మన్ నాగాబత్తుల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు దుస్తులు నేప్ కిన్‌లు పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన విజయవాడ క్రాంతి ట్రాన్స్ పోర్ట్ అధినేత మట్టపర్తి సత్యనారాయణ సమకూర్చిన దుస్తులు, నాప్‌కిన్‌లు, మొక్కలను ఆయన తల్లి అన్నపూర్ణ సర్పంచ్ చిన్నవరాజు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యనారాయణ విజయవాడలో వ్యాపారాలు చేస్తున్నప్పటికీ తన సొంత గ్రామాన్ని మర్చిపోకుండా గ్రామంలో తరచూ విద్యాభివృద్ధితో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసి వైస్ చైర్మన్ బూల మంగాదేవి క్రాంతి ట్రాన్స్ పోర్ట్ అధినేత సత్యనారాయణ గ్రామ పెద్దలు మాకే వెంకటేశ్వరరావు,కుంచే మోహనరావు,పండు చిరంజీవి, కుంచే రాజేష్, హెచ్‌ఎం జి.సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయుడు వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సబ్ స్టేషన్లలో తరచు విద్యుత్ అంతరాయాలు సంభవిస్తున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని విద్యుత్ శాఖ ఎస్ఇ రాజబాబు, డిఇ కె.రత్నాలరావు, ఎడిఎ సిహెచ్.శ్రీధర్ తెలిపారు. మండలంలోని చొప్పెల్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నివారణ కోసం పనులను వారు సోమవారం పరిశీలించారు. దాని స్థితిగతులపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ సబ్ స్టేషన్లలో విద్యుత్తు అంతరాయాలపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని అధిగమించేందుకు సిబ్బందితో తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సబ్ స్టేషన్‌పై వచ్చే అంతరాయాల నివారణకు మండల పరిధిలో వివిధ గ్రామాలకు సంబంధించిన విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేయవలసి వచ్చిందని వారు తెలిపారు. ఈ మేరకు సోమవారం పగటిపూట పూర్తిగా నిలుపుదల చేసి పనులు పూర్తి చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ ఎంకె.దుర్గప్రసాద్, లైన్ ఇన్స్పెక్టర్ కె.వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం ఎంపిడిఒగా రాజ్ కుమార్

ఉప్పలగుప్తం: ఎంపిడిఒగా పిఆర్‌సి రాజ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజ్ కుమార్ ఆలమూరు ఇఒపిఆర్‌డిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన కెవి ప్రసాద్ బదిలీపై విశాఖ జిల్లా వెళ్లారు. ఇఒపిఆర్‌డిగా బాధ్యతలు చేపట్టిన రాజ్‌కుమార్‌కు ఎంపిడిఒ గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జెడ్‌పి సిఇఒ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన రాజ్ కుమార్‌ను కార్యాలయ ఎఒ, ఎంఎల్ఎన్.మూర్తి సిబ్బంది అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి

కాకినాడ: స్థానిక ఎల్‌బి.నగర్‌లోని రాజేశ్వరి రెసిడెన్సి అపార్ట్మెంట్ దగ్గర బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మృతి చెందిన బాలుడు కుక్కల చరణ్ శ్రీతేజ (13) గుర్తించారు. చరణ్ శ్రీ తేజ స్థానిక అశోక్ నగర్‌లో ఒక ప్రయివేట్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్నాడు. తండ్రి మల్లేశ్వ రరావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. అయితే అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ చెట్టు పైనుండి పడిపోయి మృతి చెందాడని చెబుతుండగా, సిసి పుటేజ్‌లో మాత్రం అపార్ట్‌మెంట్ పై నుంచి పడిపోయినట్లుగా స్థానికులు గుర్తించారు. అయితే ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ పై నుంచి పడిపోయాడా? లేక ఎవరైనా పైనుంచి కిందకు తోయడం వల్ల ఆ బాలుడు మృతి చెందాడా? అనే అనుమానాలు కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అటుగా వెళ్తున్న ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాసు వాహనాన్ని మృతిని బంధువులు అడ్డుకుని పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. తక్షణమే విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని పోలీసులను ఆదేశించారు.

కొండెక్కిన చికెన్ ధర

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

దసరా పండగ కొందరికి పండగ అయితే.. మాంసాహారులకు మాత్రం షాక్ ఇచ్చింది. దసరా పండగ ముగిసిపోవడంతో మార్కెట్లో చికెన్ ధరలు కొండెక్కాయి. దసరా పండగ సందర్భంగా నిత్యవసరాలు ఆకాశాన్ని అంటాయి. కూరగాయల ధరలు మండిపోయాయి. ఒక్కసారిగా పెరిగిన ధరలతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు మార్కెట్ వైపు కన్నెత్తి చూడడానికి భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దసరా సందర్భంగా వేలాదిగా భవానీలు మాలలు ధరించడంతో మాంసం విక్రయాలు తగ్గిపోయాయి. వాస్తవంగా దసరాకు ముందు ఒక్కో వ్యాపారి సుమారు 80 కేజీల నుంచి 100 కేజీల వరకూ విక్రయించేవారు. దసరా ప్రారంభం నుంచి మాంసం విక్రయాలు భారీగా తగ్గిపోయాయి. రోజుకు కేవలం 30 కేజీలకు మించి విక్రయాలు సాగలేదని పలువురు వ్యాపారులు తెలిపారు. దీంతో మాంసం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. దసరా ముగిసిపోవడవంతో ఒక్కసారిగా మాంసం విక్రయాలు పెరిగిపోయాయి. దసరాకు ముందు మార్కెట్లో బాయిలర్ కోడి(లైవ్) ధర కిలో రూ.90 ఉండగా ప్రస్తుతం ఆ ధర రూ.130కి చేరింది. మాంసం కేజీ ధర రూ.180 ఉండగా ఇప్పుడు కిలో రూ.260కి చేరింది. బొంత కోళ్ళు(లైవ్) కేజీ రూ.85 ఉంటే ప్రస్తుతం రూ.125కి చేరింది. మాంసం కేజీ రూ.260లకు చేరింది. మాలధారణ తీసివేసిన తరువాత మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఇంటిల్లాపాదిని పిలుచుకుని మొక్కులు తీర్చుకునే క్రమంలో మాంసహారంతో భోజనాలు పెట్టుకునేవారు. దీంతో మాంసపు విక్రయాలు అధికంగా సాగేవి. అయితే కోడి ధర కొండెక్కడంతో మొక్కులు తీర్చుకునేందుకు వెనకడుగు వేయాల్సివస్తుందని వినియోగదారులు చెబుతున్నారు.

ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిఎస్‌సికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ ప్రాతిపదికన శిక్షణ ఇవ్వనునట్లు చెప్పారు. టెట్‌లో ఉత్తీర్ణులై వారికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి దానిలో 85 శాతం, టెట్ నందు పొందిన మార్కుల్లో 15 శాతం వెయిటేజీని ఇచ్చి, వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉన్న వారిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

ఉప్పాడలో ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

టాఫిక్ అంతరాయంతో నిలిచిపోయిన వాహనాలు

ఉప్పాడ-పిఠాపురం రహదారిలో నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. ఉప్పాడలో ఏర్పాటు చేసిన జియో మార్ట్ వద్ద వాహనాలు నిలుపుదల చేయడానికి స్థలం లేకపోవడంతో కొనుగోలుదారులు రోడ్డుపై వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. దీంతో సాయంత్ర సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. మరోపక్క భారీ వాహనంతో జియో మార్టు సరుకులు తెచ్చి రోడ్డుకు అడ్డంగా నిలుపుదల చేయడం తో వాహనాలు వెళ్లే మార్గం లేకపోవడం తో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పట్టించుకోవాల్సిన అధికారులు స్పందించకపోవడంతో ఉప్పాడ నుంచి పిఠాపురం వెళ్లే వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - జగ్గంపేట

గురువులతో పూర్వ విద్యార్థులు

మండలంలోని మల్లిశాల గ్రామంలో జడ్‌పి ఉన్నత పాఠశాల 2007 10వ తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. తొలుత పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మల్లిశాల గ్రామస్తులు, విద్యార్థుల సహకారంతో పాఠశాల అభివృద్ధి చెందిందన్నారు. పాఠశాల అభివృద్ధికి నేటి తరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు తాతారావు, సుబ్బయ్య, కనకవల్లి, తాతాజీ, చక్రధర్, సతీష్, ఆంజనేయులు, అచ్యుత్, డివిడి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

పట్టణ పరిధిలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పాత ఆసుపత్రి వీధి, వరహాలయ్య పేట, కొత్తపేట, పాత బస్టాండ్ కృష్ణుడి గుడి సెంటర్లలో సోమవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు యూనియన్ అధ్యక్షులు ఎం.నాగరాజు, ఉపాధ్యక్షులు బి.నాయుడు, సెక్రటరీ ఎల్ఎన్.రాజు, సహాయ కార్యదర్శి గోపి పాల్గొన్నారు. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో విజయ దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పెద్దాపురం నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ప్రారంభించారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి

జగ్గంపేటలో అన్నదానం చేస్తున్న జ్యోతుల నవీన్

పేద ప్రజల ఆకలి తీర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. సోమవారం జగ్గంపేటలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ప్రతి సోమవారం నిర్వహించే అన్న క్యాంటీన్‌లో అన్నదానం కార్యక్రమం జరిగింది. గండేపల్లి మండలం ఎన్‌టి రాజాపురం గ్రామానికి చెందిన క్రీర్తిశేషులు వీర్రాజు అన్నపూర్ణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు పరిమి నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో అన్నదానం కార్యక్రమాన్ని జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోర్పు లచ్చయ్యదొర, మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు కోర్పు సాయితేజ, సొసైటీ మాజీ అధ్యక్షులు పరిమి బాబు, కందుల చిట్టిబాబు, వైస్ ఎంపిపి కుంచే రాజా, జాస్తి వసంత్ పాల్గొన్నారు.

ఎన్నికల ముందే కులగణన చేపట్టాలి

ప్రజాశక్తి-కొత్తపేట

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కుటగణన చేపట్టాలని తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బొక్కా ప్రసాద్ కోరారు. చేతి వృత్తులనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులాల పరిస్థితి గత వైసిపి హయాంలో మరింత దిగజారిందన్నారు. దేశంలో సగానికి పైగా వందకు పైగా బిసి ఉపకులాలు అభివద్ధి మాత్రం శూన్యం అన్నారు. గత ప్రభుత్వంలో విభజించు పాలించు అనే విధంగా 56 బిసి కార్పొరేషన్లుగా విభజించి ఏ కార్పోరేషన్‌కూ ఒక్క రూపాయి నిధులు కేటాయించకుండా బిసి కులాలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. షెడ్యూల్ కులాలకు 20 పథకాలకు పైగా అందకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. గతంలో స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను రద్దు చేసి 24 శాతానికి కుదించడం వల్ల బిసిలకు అధికారాన్ని దూరం చేసిందన్నారు. బిసిలకు స్థానిక సంస్థల్లో న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేసారు.

క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

మెడ్ యునైటెడ్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

అమలాపురం కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఆత్రేయపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడ్ యునైటెడ్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ సోమవారం స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్సి కిమ్స్ ఛైర్మెన్ చైతన్య రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్ఎ సత్యానందరావు, కిమ్స్ ఎండి రవి వర్మ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు 20 ఏళ్లుగా కిమ్స్ ఆధ్వర్యంలో వైద్య సేవలు విస్తతంగా అందజేయడమే కాక, నేటి నుంచి రూరల్ గ్రామీణాభివృద్ధిలో వైద్యం అందించడానికి మెడ్ యునైటెడ్ హాస్పిటల్ ఏర్పాటు చేసి గ్రామీణ వైద్య సేవలు అందించేందుకు కృషి చేయడం ద్వారా ఇక్కడ ప్రజల అదష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్లినిక్‌లో ప్రపంచ స్థాయి అధునాతన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రావులపాలెంలోనూ ఇటువంటి సెంటర్ ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ సత్యానందరావు కోరగా చైతన్యరాజు సానుకూలంగా స్పందించారు. ఇటువంటి వైద్య సేవలు అందిస్తున్న చైతన్య రాజు వారి కుమారులను ఆకుల రామకృష్ణ, గ్రామ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడ్ యునైటెడ్ మేనేజింగ్ డైరెక్ట్ కళ్యాణ్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నాగేంద్ర విజయ్, మంతెన రవి రాజు, ముదునూరి రామరాజు, గాదిరాజు ప్రసాద్ రాజు, పిఎస్.రాజు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PENDAM VEERA VENKATA DURGA PRASAD , S/o SEETA RAMA RAJU, age 35 Years, Now R/o D.No. 3-32, Gandhi Bomma Center, Atchutapuratrayam Village of Pedapudi (M), Kakinada Dist. I have changed my Name from PENDAM VEERA VENKATA DURGA PRASAD (Old Name) to PENDEM VEERA VENKATA DURGA PRASAD (New Name). Hence I am being called PENDEM VEERA VENKATA DURGA PRASAD As Per Affidavit dated 14-10-2024. for all Pupose S. RAMA KRISHNA Advocate - Notary, Kakinada

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 932/2023
Between:
Padmanabhuni Swarnalatha ...*Plaintiff*
AND
Yarra Siva Kumar, S/o. late Bhaskara Rao, Hindu, aged 45 years, R.S.Dresses, D.No. 1-88, Chakalipeta, Panchayathi Street, Hukumpeta, Rajamahendravaram, E.G.Dt., ...*Defendant*

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 18-10-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి **జి.వి.రామలక్ష్మి**
9-10-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ 7వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 931/2023
Between:
Padmanabhuni Venkata Kondala Rao ...*Plaintiff*
AND
Yarra Siva Kumar, S/o. late Bhaskara Rao, Hindu, aged 45 years, R.S.Dresses, D.No. 1-88, Chakalipeta, Panchayathi Street, Hukumpeta, Rajamahendravaram, E.G.Dt., ...*Defendant*

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 23-10-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి **జి.వి.రామలక్ష్మి**
10-10-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 1028/2023
Between:
Padmanabhuni Venkata Vinod Kumar ...*Plaintiff*
AND
Yarra Ramakrishna, S/o. late Bhaskara Rao, Hindu, aged 41 years, R.S.Dresses, D.No. 45-29-21/3, Thadithota, Rajamahendravaram, E.G.Dt., ...*Defendant*

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 01-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి **జి.వి.రామలక్ష్మి**
9-10-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు, రాజమహేంద్రవరం
F.D.I.A. No. 5/2024
O.S. No. 379/2017
బిట్వీన్:
గానుగుల శ్రీ కృష్ణార్జునరావు **-పిటిషనర్**
మరియు
గాద శ్రీనివాసరావు **-రెస్పాండెంట్**
టు: రెస్పాండెంట్:
గాద శ్రీనివాసరావు, తండ్రి: సుబ్బారావు, హిందు, వయస్సు 48 సం॥లు, డోర్ నెం. 5-106, బుర్రిలంక గ్రామం, కడియం మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు ఎఫ్.డి.ఐ.ఎ. పిటీషన్ నందు రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిమార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన జారీ చేయడం అయినది. కావున మీరు సదరు పిటీషన్‌లో ఏమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 13-11-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా ప్లీడరు గారు ద్వారా గాని హాజరు అయ్యి తమ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు ఎఫ్.డి.ఐ.ఎ. పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
బి.సదాశివరావు, అడ్వకేట్
రాజమహేంద్రవరం
సెల్: 9441474932

YELESWARAM NAGAR PANCHAYAT
e-Procurement Notice
Online tenders are invited for ROC. No. 38/2024/E1, Dt. 10-10-2024 General Fund Works - 2 Estimate amount of Rs. 17.50 Lakhs. Last date of receipt of tenders on or before Dt: 26-10-2024 up to 5.30 P.M. Further details can be seen at www.tender.apeprocurement.gov.in
Contact Number: 9652065430, 9652065431
Sd/- **COMMISSIONER**
YELESWARAM NAGAR PANCHAYAT